సంపుటి :03 | సంచిక :40 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

బుధవారం 18, మార్చి 2026

## కార్మికుల వారసులకు ఉద్యోగాలివ్వాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

05




## ఉగాది శుభాకాంక్షలు

చైత్ర మాసపు శుభవేళ.. ప్రకృతి మగువ పచ్చని పట్టుచీర కట్టుకున్నట్లుగా నవ వసంతం గురువారం మన ముంగిట కొలువుదీరనుంది. చెట్టుకొమ్మన చేరిన కోయిలలు.. కొత్త రాగాలను ఆలపిస్తుంటే, చిగురించిన మామిడి చిగురు కోయిలమ్మలకు విందు సిద్ధం చేస్తోంది. ఇంటి ద్వారానికి వేలాడే మామిడి తోరణాలు శుభాలకు స్వాగతం పలుకుతుంటే, వంటింట్లో సిద్ధమయ్యే ఉగాది పచ్చడి పరిమళాలు మనసును పులకింపజేయనున్నాయి. తీపి, పులుపు, చేదుల సమ్మేళనమైన ఆ షడ్రుచులు జీవితంలోని కష్టసుఖాల కలబోతను మనకు అందించనున్నాయి. కొత్త ఆశలతో, కోటి కాంతులతో వికసించిన ఈ ఉగాది మీ ఇంట సకల సంపదలను నింపాలని ఆకాంక్షిస్తూ.. ప్రకటన కర్తలు, పాఠకులకు పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు


- అక్షరదర్బార్ టీం

02











# మర్డర్ మిస్టరీ!

## టు బీ కంటిన్యూడ్

- ఒక్క వారంలో ఆరుగురు హతం
- మృతుల్లో దంపతుల జంట
- ఒక యువ డాక్టర్.. ఒక యువకుడు
- ఈ ఘటనలు మరువకముందే తాజా మరో ఘటన
- భార్య, మామ సజీవ దహనం
- కడిపికొండ రాజీవ్ గృహకల్పలో ఘటన
- కొద్దిగంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- మిగతా కేసుల దర్యాప్తు కూడా వేగవంతం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా చోటుచేసుకుంటున్న వరుస అనుమానాస్పద మరణాలు చర్చనీయాంశాలయ్యాయి. ఒక విధంగా చెప్పాలంటే.. ఒక్కో మర్డర్ వింటుంటే గుండెల్లో గగుర్పాటు వచ్చే విధంగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వరుసగా.. ఒక యువ వైద్యుడు, ఒక యువకుడు, రాజధాని నగరంలో దారుణ హత్యకు గురైన దంపతులు, కాజీపేటలో సజీవ దహనమైన తండ్రీకూతుళ్లు.. ఇలా వరుస ఘటనలు పోలీసు యంత్రాంగానికి పెను సవాల్‌గా మారాయి. ఈ మరణాల వెనుక ఉన్న కారణాలను అన్వేషించడం, నిందితులను చట్టానికి అప్పగించడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి కేసును లోతుగా విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే అత్యంత క్లిష్టంగా మారిన తండ్రీకూతుళ్ల మరణం వెనుక ఉన్న కుట్రను పోలీసులు చాకచక్యంగా ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకోవడం విశేషం. మిగిలిన కేసుల్లోనూ నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు ఫోరెన్సిక్ ఆధారాలు, సాక్ష్యాలను విశ్లేషిస్తున్నారు. – అక్షరదర్బార్, వరంగల్

02

## కోర్టుకు బాంబు బెదిరింపులు

- న్యాయ స్థానమంతటా సోదాలు
- చివరకు బెదిరింపులు.. ఫేక్ అని తేల్చిన పోలీసులు

05




## సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపు

- డీవోపీటీ కీలక నిర్ణయం

02



## గన్నేరుపప్పు తిని ఎస్సై భార్య బలవన్మరణం

- కరీంనగర్‌లో వెలుగు చూసిన ఘటన
- కుటుంబ కలహాలా.. ఇతర కారణాలా అన్న కోణంలో దర్యాప్తు



## ఏసీబీ వలలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్


- బినామీగా మారిన టీచర్ స్నేహితుడు
- అదుపులోకి ఇద్దరు నిందితులు
- సోదాల్లో రూ. 20 లక్షల నగదు స్వాధీనం
- లంచాల పర్వానికి చెక్ పెట్టిన ఏసీబీ

02

# మర్డర్ మిస్టరీ !

■ ఒక్క వారంలో ఆరుగురు హతం
■ మృతుల్లో దంపతుల జంట
■ ఒక యువ డాక్టర్.. ఒక యువకుడు
■ ఈ ఘటనలు మరువకముందే తాజా మరో ఘటన
■ భార్య, మామ సజీవ దహనం
■ కడిపికొండ రాజీవ్ గృహకల్పలో ఘటన
■ కొద్దిగంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
■ మిగతా కేసుల దర్యాప్తు కూడా వేగవంతం

## టు బీ కంటిన్యూడ్




**అక్షరదర్బార్, వరంగల్ :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా చోటుచేసుకుంటున్న వరుస అనుమానాస్పద మరణాలు చర్చనీయాంశాలయ్యాయి. ఒక విధంగా చెప్పాలంటే.. ఒక్కో మర్డర్ వింటుంటే గుండెల్లో గగుర్పాటు వచ్చే విధంగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వరుసగా.. ఒక యువ వైద్యుడు, ఒక యువకుడు, రాజధాని నగరంలో దారుణ హత్యకు గురైన దంపతులు, కాజీపేటలో సజీవ దహనమైన తండ్రీ కూతుళ్లు.. ఇలా వరుస ఘటనలు పోలీసు యంత్రాంగానికి పెను సవాల్‌గా మారాయి. ఈ మరణాల వెనుక ఉన్న కారణాలను అన్వేషించడం, నిందితులను చట్టానికి అప్పగించడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి కేసును లోతుగా విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే అత్యంత క్లిష్టంగా మారిన తండ్రీ కూతుళ్ల మరణం వెనుక ఉన్న కుట్రను పోలీసులు చాకచక్యంగా ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకోవడం విశేషం. మిగిలిన కేసుల్లోనూ నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు ఫోరెన్సిక్ ఆధారాలు, సాక్ష్యాలను విశ్లేషిస్తున్నారు.

### - రోడ్డు పక్కన యువకుడి మృతదేహం

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తొగరాయి గ్రామ శివారులో ఒక యువకుడు విగతజీవిగా పడి ఉండటం స్థానికంగా కలకలం రేపింది. నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామానికి చెందిన బొంతర బోయిన మనోహర స్వామి (26) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున కల్వర్టు పక్కన మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇది సాధారణ రోడ్డు ప్రమాదమా లేక దీని వెనుక ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి విచారణ జరుపుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

### - హైదరాబాద్ లో దంపతుల దారుణ హత్య



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గన్యచక్రతండాకు చెందిన దంపతుల హత్య ఉమ్మడి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ధరావత్ మంగమ్మ (40), సోము (45) జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని పటాన్‌చెరువు ప్రాంతంలో కూలి పనులు చేసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన వీరిని గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత దారుణంగా హత్య చేశారు. ఈ హత్యకు గల కారణాలు నేటికీ మిస్టరీగానే ఉన్నాయి. వారి రెండో కుమార్తె వసంత శనివారం పదో తరగతి పరీక్ష రాసి సంతోషంగా హాస్టల్‌కు చేరుకున్న తర్వాత బంధువుల ద్వారా ఈ వార్త తెలియడంతో కన్నీరు మున్నీరవుతోంది.

### నర్సంపేటలో యువ వైద్యుడి మరణం మిస్టరీ



వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన యువ వైద్యుడు డాక్టర్ జొన్నడ శశిధర్‌రెడ్డి (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం సృష్టించింది. కేఎంసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన, శనివారం రాత్రి ఆస్పత్రిలోనే పడుకుంటానని భార్య సింధూరరెడ్డికి చెప్పి వెళ్లారు. ఆదివారం ఉదయం బెడ్‌పై ఆయన విగతజీవిగా కనిపించడంతో తోటి వైద్యులు షాక్‌కు గురయ్యారు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అనుమానాస్పద మృతిగా కేసు నమోదైంది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే ఈ మరణానికి గల కారణాలు స్పష్టమవుతాయని పోలీసులు భావిస్తున్నారు.

# భార్య, మామ సజీవ దహనం

■ సుత్తితో బాది.. ఆ తర్వాత పెట్రోల్ పోసి నిప్పు
■ కొద్ది గంట ల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
■ అదుపులోకి నిందితుడు

అక్షరదర్బార్, కాజీపేట :హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం తెల్లవారుజామున అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్నకూతురి అన్నప్రాసన వేడుక కోసం వచ్చిన అల్లుడు ప్రవీణ్ కాలయముడిలా మారి భార్యను, మామను పొట్టనబెట్టుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మామ రాజశేఖర్ (54), భార్య రాజశ్రీ (24)ను సుత్తితో బాది దారుణంగా హత్య చేసిన అనంతరం, సాక్ష్యాలను రూపుమాపేందుకు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ అగ్నిప్రమాదంలో తండ్రీకూతుళ్లిద్దరూ సజీవ దహనమవ్వడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రాజశ్రీ, ప్రవీణ్ దంపతులకు ఇద్దరు సంతానం. తమ చిన్న కుమార్తె అన్నప్రాసన వేడుక నిర్వహించేందుకు రెండు రోజుల క్రితమే వీరు కడిపికొండలోని రాజశేఖర్ ఇంటికి వచ్చారు. మంగళవారం వేడుక ఘనంగా ముగిసినప్పటికీ, కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలు మరోసారి రగిలాయి. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో అందరూ నిద్రిస్తున్న వేళ ప్రవీణ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. తొలుత మామను, భార్యను సుత్తితో కొట్టి ప్రాణాలు తీసి, ఆపై ఆనవాళ్లు దొరక్కుండా ఇంట్లో పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఇల్లు తగలబడుతుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించేలోపే బాధితులు మంటల్లో కాలి బూడిదయ్యారు. ఘోరానికి పాల్పడిన అనంతరం నిందితుడు ప్రవీణ్ తన ఇద్దరు పిల్లలను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న మడికొండ సీఐ పీ. కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలిని క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడు వాడిన సుత్తితో పాటు ఇతర కీలక ఆధారాలను సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ జంట హత్యలకు ప్రధాన కారణమని భావిస్తున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడు ప్రవీణ్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



రాజశేఖర్ ఫైల్ రాజశ్రీ(ఫైల్)

# గన్నేరుపప్పు తిని ఎస్సై భార్య బలవన్మరణం

■ కరీంనగర్ లో వెలుగు చూసిన ఘటన
■ కొనసాగుతున్న దర్యాప్తు



అక్షరదర్బార్, కరీంనగర్ : కరీంనగర్ టూ టౌన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య (26) ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం రేపింది. కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలతో ఆమె గన్నేరుపప్పు దంచుకుని తిని ప్రాణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు చిన్నారులు ఉన్న ఆ కుటుంబంలో ఈ ఘటన తీరని శోకాన్ని మిగిల్చింది. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో నివాసముంటున్న దివ్య, మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరితమైన గన్నేరుపప్పును దంచుకుని తిన్నారు. దీనివల్ల ఆమె ఆరోగ్యం క్షణాల్లో విషమించడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించారు. చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడేళ్లలోపు వయసున్న ఆ చిన్నారులు తల్లిని కోల్పోయి అనాథలుగా మారడం చూసి బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. తోటి పోలీసు సిబ్బంది ఎస్ఐ చంద్రశేఖర్‌ను పరామర్శించి ఓదార్చుతున్నారు. దివ్య ఆత్మహత్యకు గల అసలు కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ఏసీబీ వలలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

■ బినామీగా మారిన టీచర్ స్నేహితుడు
■ అదుపులోకి ఇద్దరు నిందితులు
■ సోదాల్లో రూ. 20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న ఏసీబీ



అక్షరదర్బార్, కరీంనగర్ : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండేటి రాము పట్టుబడ్డారు. మామూళ్ల వసూళ్లలో అతనికి సహకరించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జక్కని వేణును కూడా అధికారులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. గతంలో వీరిద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేసిన వీరిద్దరి స్నేహం, చివరకు అవినీతి అక్రమాలకు మార్గంగా మారింది. గతంలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా రాము, వేణు కలిసి పనిచేశారు. ఆ తర్వాత రాము ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కావడంతో, తన అక్రమ సంపాదనను దాచడానికి స్నేహితుడిని వాడుకున్నాడు. వేములవాడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన కాలంలో బెల్లం వ్యాపారుల నుంచి వసూలు చేసిన లంచాలను నేరుగా తీసుకోకుండా, ఒబులాపూర్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న వేణు బ్యాంక్ ఖాతాలకు యూపీఐ ద్వారా మళ్లించేవాడు. 2019–24 వరకు వేణుకు చెందిన ఎస్బీఐ, యూబీఐ ఖాతాల్లోకి భారీగా నిధులు బదిలీ అయ్యాయి. ఆ తర్వాత ఆ సొమ్మును ఇన్‌స్పెక్టర్ రాము లేదా అతని తండ్రి ఖాతాలకు వేణు తిరిగి బదిలీ చేసేవాడు. ఇన్‌స్పెక్టర్ రాము అక్రమాలపై ఏసీబీ డీజీపీకి ఫిర్యాదు అందడంతో అధికారులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాము నివాసంలో సోదాలు నిర్వహించగా, రూ. 20 లక్షల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌కు బినామీగా వ్యవహరించిన టీచర్ వేణు పాత్రను కూడా నిర్ధారించిన అధికారులు, వీరిద్దరినీ అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

# మానవత్వానికి ప్రతీక కూసం రాజమౌళి

అక్షర దర్బార్, దుగ్గొండి: అమరజీవి కామ్రేడ్ కూసం రాజమౌళి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని, ఆయనకు నిజమైన నివాళి దోపిడి వ్యతిరేక పోరాటాలేనని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య పేర్కొన్నారు. గంగాదేవిపల్లిలో నిర్వహించిన సంతాప సభలో రాజమౌళి చిత్రపటానికి పూలమాలలు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన చిన్న వయసులోనే ఎర్రజెండా సిద్ధాంతాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి గంగాదేవిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారని కొనియాడారు. రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ దోపిడీకి వ్యతి



రేకంగా పోరాటాలు నిర్వహించి, నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన నాయకుడిగా రాజమౌళి గుర్తుండిపోతారని తెలిపారు. కమ్యూనిస్టు ఐక్యతతో సమాజంలో అసమానతలు తొలగించవచ్చని అన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య జి రాములు ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ మండల నాయకులు ఆకుల రుద్ర ప్రసాద్ సిపిఎం ఉమ్మడి జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి గాదె ప్రభాకర్ రెడ్డి ఎం చుక్కయ్య సిహెచ్ రంగయ్య భూక్య సమ్మయ్య నలిగంటి రత్నమాల సింగారపు బాబు నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలెల్లి శ్రీనివాస్ సిపిఐ నాయకులు వీరగోని శంకరయ్య

# అన్న ప్రసాద వితరణ

అక్షరదర్బార్, బాలసముద్రం: శ్రీ భద్రకాళీ వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య రోజున చేపట్టే అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం హనుమకొండ బాలసముద్రంలో జరిగింది. యుద్ధం కారణంగా ధరలు పెరిగి ఖర్చులు అధికం అయినప్పటికీ, ఎల్పీజీ ఇబ్బందులు ఉన్నా, క్రమం తప్పకుండా ప్రతినెలా అమావాస్య అన్న ప్రసాద వితరణను కొనసాగించామని కార్యక్రమ రూపకర్త పిన్నా శివకుమార్ తెలిపారు. అన్న ప్రసాద వితరణ చేయడం ఆత్మ సంతృప్తిని కలిగిస్తోందని అన్నారు. 600 మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వంగర గ్రామస్తులు స్వర్గీయ చోల్లేటి అనసూర్య జ్ఞాపకార్థం కుమారుడు శ్రీధర్ స్వీట్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఉల్లెంగుల మహేష్, సత్యనారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, చోల్లేటి శ్రీధర్, గౌరిశెట్టి ధనుంజయ, పాములపర్తి కేశవ్ కుమార్, దేవునూరి రాధా కృష్ణ ఎలుగూరి రామ్మోహన్ పాల్గొన్నారు.



# వ్యాపార లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి

## ఏప్రిల్ 1 నుంచి 25 శాతం పెనాల్టీ

## మున్సిపల్ కమిషనర్ అంజయ్య

అక్షర దర్బార్, పరకాల: పరకాల పురపాలక సంఘ పరిధిలోని వ్యాపారస్తులు 2026-27 సంవత్సరానికి సంబంధించిన వ్యాపార లైసెన్సులను ఈ నెల 31లోపు తప్పనిసరిగా రీన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య సూచించారు. మార్చి 31 తరువాత, ఏప్రిల్ 1 నుంచి రీన్యువల్ చేసుకునే వారికి 25 శాతం పెనాల్టీ విధించబడుతుందని, పట్టణంలోని వ్యాపారులు ఆలస్యం చేయకుండా మున్సిపల్ కార్యాలయంలో లైసెన్సులు రీన్యువల్ చేసుకోవాలని కోరారు. ఇంకా ఇప్పటివరకు వ్యాపార లైసెన్సులు తీసుకోని వారు కూడా వెంటనే లైసెన్సులు పొందాలని కమిషనర్ సూచించారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్



అక్షర దర్బార్, నర్సంపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. బుధవారం 3వ వార్డులో స్వయంకృషి మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహిళా సాధికారత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇందిరా మహిళా శక్తి' పథకం, వడ్డీ లేని రుణాలపై వివరించి మహిళలు పొదుపు పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలను సత్కరించి, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ ముత్తినేని వెంకన్న, 4వ వార్డు కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్, 3వ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం

## పశు సంవర్ధకానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం నార్లపూర్ గ్రామంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పశువులు కీలకమని, పశువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడి అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. శిబిరంలో వెటర్నరీ వైద్యులు వినయ్, శ్రీరామ్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవీందర్, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మార్కెట్ సెక్రటరీ జీవన్ కుమార్, డైరెక్టర్లు భోగం కమల, రంజన్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈర్ల చిన్ని తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బాధితులకు అండగా సీఐ రమేష్



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని రాజీపేట అంబేద్కర్ సెంటర్ పరిధిలో ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన పలు కుటుంబాలను సీఐ ఒంటేరు రమేష్ పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చిన ఆయన, ఇలాంటి కష్టకాలంలో సమాజం కలిసి నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజీపేట కాలనీకి చెందిన గడ్డం రమేష్, ఒంటేరు బాబు, ఒంటేరు సురేష్, బొట్ల నరేష్, బొచ్చు రాజు స్వేరో తదితరులు పాల్గొన్నారు.



# ఒడితలలో వైద్య శిబిరం

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం ఓడితల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 136 మంది రోగులకు వివిధ రకాల టెస్టులు నిర్వహించి, మందుల పం పిణీ చేశారు. ఈ కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ రాగల్ల మౌనిక గారి ఆధ్వర్యంలో జరుగగా గైనకాలజిస్ట్ డాక్టర్ సంధ్య డాక్టర్ జ్ఞాపిక డాక్టర్ మానస డాక్టర్ మౌనికలు వైద్య సేవలను అందించారు.



# అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

## చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్

అక్షర దర్బార్, చిట్యాల: మండలంలో అక్రమ ఇసుక రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్ఐ పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. బుధవారం కాల్వపెల్లి ఇసుక క్వారీ వద్ద కూలీలు, ట్రాక్టర్ యజమానులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు. నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేయరాదని, వాహనాలకు ఇన్స్యూరెన్స్ ఉండాలని తెలిపారు. డ్రైవర్ల వద్ద చెల్లుబాటు అయ్యే లైసెన్స్ తప్పనిసరి అని, మైనర్లు ట్రాక్టర్లు నడిపితే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది పరామర్శ

అక్షర దర్బార్, దుగ్గొండి: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తాళ్ల సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గార్డియన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ కలిసి బాధితున్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





# చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ..

**అండగా నిలిచిన ఇనగాల ట్రస్ట్**

**అపోలోలో విజయవంతమైన శస్త్రచికిత్స**

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన బొచ్చు శరత్–చైతన్య దంపతుల ఆరు నెలల చిన్నారి బుత్వికకు గుండె సమస్య తలెత్తడంతో అత్యవసరంగా శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. భారీ ఖర్చును భరించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబం హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని ఆశ్రయించింది. వెంటనే స్పందించిన ఆయన, అపోలో ఫౌండేషన్ 'హృదాన్' ప్రోగ్రామ్ ద్వారా ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. తమ బిడ్డకు ప్రాణం పోశారని తల్లిదండ్రులు ఇనుగాలకు, ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# 'శ్రీ కుంకుమేశ్వర'లో ఉగాది వేడుకలు

**సాయంత్రం పంచాంగ శ్రవణం**



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర దేవస్థానంలో ఉగాది పండుగ వేడుకలు రేపు (మార్చి 19) గురువారం ఘనంగా నిర్వహించ నున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆలయ అర్చకులు సంపత్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించబడుతుంది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని, భక్తులు సంప్రదాయ తెలుగు దుస్తుల్లో పాల్గొని కుంకుమేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు కోరారు.



# కస్తూర్బాలో తహసీల్దార్ తనిఖీ

అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలను తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థినీలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో 145 మంది విద్యార్థులకు 145 మంది, ఎంజేపీ పాఠశాలలో 180 మందికి 180 మంది హాజరైనట్లు తహసిల్దార్ తెలిపారు. ఆయన వెంట జీపీవో వంగేటి, సత్యం పాల్గొన్నారు.

# ఎలాంటి ఇబ్బందులుండొద్దు

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**- యాసంగి ధాన్యం కొనుగోలుపై అధికారులకు దిశా నిర్దేశం**



అక్షరదర్బార్, హనుమకొండ : యాసంగి వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులు ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో యాసంగి వరి ధాన్యం సేకరణపై వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రైతులు యాసంగి వరి ధాన్యాన్ని విక్రయించే నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో గన్నీ సంచులు కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలని, అనంతరం బియ్యాన్ని ఎఫ్ సి ఐ కి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సొసైటీ గ్రామ సెక్రెటరీ, సెంటర్ ఇన్చార్జిలు, నోడల్ ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్ సమన్వయంతో పనిచేసి సరియైన రీతిలో రైతుల వద్ద వివరాలు సేకరించి ఆయా రైతులు ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో టోకెన్ పద్ధతి ద్వారా ముందుగానే తెలియజేయాలని అన్నారు. రైతుల ఆధార్ నెంబర్ ఆధారంగా ధాన్యం వివరాలు, వెహికల్ నెంబర్, సాగు చేసిన విస్తీర్ణం అమ్మకానికి వచ్చిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా నమోదు చేయడం ద్వారా రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం విక్రయించడం జరుగుతుందని ఆమె తెలిపారు మిల్లర్లకు పోయే ధాన్యం తిరిగి పంపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా మొత్తంలో హమాలీలకు రేటును నిర్ధారించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణలో సంబంధిత శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, ఇతర శాఖల అధికారులు, ఐకెపి కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# సీఎస్ పదవీ కాలం పొడిగింపు

**- డీవోపీటీ కీలక నిర్ణయం**

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు సర్వీసు పొడిగింపుపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఆయన పదవీ కాలాన్ని మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణా రావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణా రావు గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు కేంద్రం ఆయన సర్వీసును 7 నెలల పాటు పొడిగించింది. తాజాగా మార్చి 31తో ఆ గడువు ముగుస్తుండటంతో, ప్రభుత్వం మరోసారి పొడిగింపు కోసం కేంద్రానికి లేఖ రాసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన డీవోపీటీ, మరో మూడు నెలల పాటు ఆయనను అదే పదవిలో కొనసాగించేందుకు అనుమతించింది.

# అక్షర, బిట్స్ లో పండుగ వేడుకలు

అక్షర దర్బార్, నర్సంపేట: బాలాజీ విద్యాసంస్థల్లో భాగమైన అక్షర, బిట్స్ పాఠశాలల్లో బుధవారం ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ డా. ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ డా. ఏ. వనజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. వనజ మాట్లాడుతూ ఉగాది పండుగ కొత్త సంవత్సరానికి నాంది అని, ఉగాది పచ్చడి జీవనంలోని సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. డా. రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ ముస్లింలకు పవిత్రమైన పండుగగా, ఉపవాస దీక్షతో ఈద్–ఉల్–ఫితర్‌గా జరుపుకుంటారని వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో అలరించగా, ముస్లిం విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# తెలుగులోగిలి ఉగాది



'శ్రీ' కరంబగు రీతి చిగురించె నేలమ్మ
'ప' సిడి కాంతులతోడ పరవశించ
'రా' రమ్మని బిలిచె ఆమని రాగాలు
'భ' క్తి భావము నింపి బతుకుదెలుప
'వ' చ్చె పరాభవ వత్సర నామమై
'ఉ' ల్లముల్ హర్షింప ఉత్సవమ్ము
'గా' నాలు కలకంఠి గాయముల్ మాన్పగా
'ది' వ్యమౌ పండుగ ఇలను వెలిసె
ములుగు లోగిలి విలసిల్లు ఉత్సవాలు
కవుల గళముల కైతలు కాంతినింప
తెలుగు లోగిలి నిండును తేటగాను
శుభము కూర్చును మనకంత శోభనముగ

ముడుంబై ప్రవీణ్ కుమార్
ఎస్ఎ తెలుగు, కవి,రచయిత, ములుగు



# ఎస్సై ని సన్మానించిన సర్పంచ్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఇటీవల ఎస్ఐల బదిలీల్లో భాగంగా మొగుళ్ళపల్లి నూతన ఎస్సైగా ఎం సురేష్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ తోపాటు వార్డు మెంబర్లు సంయుక్తంగా ఎస్సై ని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు



# నవోదయ ప్రవేశ పరీక్షలో జయకేతనం

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మండలం లక్నపల్లి లోని బాలాజీ టెక్నో స్కూల్ (సీబీఎస్ఈ) విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన 2026–27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటారు. మొత్తం 10 సీట్లను సాధించి జిల్లా స్థాయిలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రేయాస్, విశ్వజిత్, యువన్, సాత్విక్, ఆరుషి, విజయ్, కార్తిక, అజిత్, తరీన, సాక్షిత రామ్ అర్హత సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ డా. ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్య భవిష్యత్తుకు పునాది అని, విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానాచార్యులు పి. రాజేంద్రప్రసాద్ విద్యార్థులను అభినందించి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం

- త్వరలో డిజిటల్ మీడియా పాలసీ, అక్రిడిటేషన్లు జారీ
- రెండు నెలల్లో స్పష్టత తీసుకొస్తాం..
- ఇళ్ల స్థలాల పంపిణీకి కసరత్తు చేస్తున్నాం..
- శాసన మండలి వేదికగా మంత్రి పొంగులేటి హామీ



అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వచ్చే రెండు మూడు నెలల్లోనే నూతన 'డిజిటల్ మీడియా పాలసీ'ని తీసుకురానున్నట్లు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాల అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. డెస్క్ మరియు ఫీల్డ్ జర్నలిస్టుల మధ్య ఎటువంటి వివక్ష చూపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ల జారీ కోసం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని, గతంలో ఇచ్చిన 252 జీవోను జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు సవరించామని తెలిపారు. అవసరమైతే మరిన్ని సవరణలు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావులేదని ఆయన భరోసా ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని మంత్రి వెల్లడించారు. ఎటువంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల గురించి స్పష్టమైన హామీ ఇచ్చారని, అతి త్వరలోనే ఆ తీపి కబురు వినిపిస్తామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ మీడియా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీని రూపొందిస్తోంది. ఇప్పటికే ఈ పాలసీకి సంబంధించి ముసాయిదా సిద్ధమైందని, వచ్చే రెండు నెలల్లో దీనికి తుది రూపం ఇచ్చి అమలులోకి తీసుకువస్తామని మంత్రి పొంగులేటి వివరించారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

## పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు

పరాభవం ఎరుగని ప్రగతి కావాలి ఈ ఉగాది
అహంకారం దరిచేరని వినతి కావాలి ఈ ఉగాది
అవమానం లేని ఆత్మీయత కావాలి ఈ ఉగాది
పరాభవ నామ సంవత్సరంలో..
పునర్జన్మ పొందాలి ప్రతి ఆశీస్సుల ఈ ఉగాది!
గత అపజయాల చీకట్లు వీడి
నవ విజయాల బాటలో అడుగులు వేద్దాం..
విద్వేషాల నీడలు విడిచి
స్నేహ సౌరభాలతో అందరం కలిసి సాగుదాం..
ఈ 'పరాభవ' నామ సంవత్సరంలో..
అపజయాలు లేని విజయాలు మనవవ్వాలని,
అందరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలని ఆశిస్తూ..
అందరికీ ఉగాది శుభాకాంక్షలు!



**చుంచు రమేష్,**
**జర్నలిస్ట్,**
**సామాజిక కార్యకర్త**

## వరంగల్ కోర్టుకు బాంబు బెదిరింపులు

- న్యాయస్థానమంతటా సోదాలు
- ఫేక్ అని తేల్చిన పోలీసులు

అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్ జిల్లా కోర్టుకు బుధవారం మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు కోర్టు అధికారిక మెయిల్‌కు ఈ బెదిరింపు సందేశం పంపారు. దీంతో హనుమకొండ అదాలత్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందిన వెంటనే సుబేదారి పోలీసులు, బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కోర్టుకు చేరుకున్నాయి. కోర్టులోని ప్రతి గదిని, రికార్డు రూములను, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాకపోవడంతో మెయిల్ ఫేక్ అని తేల్చారు. గడిచిన రెండు నెలల్లో ఇలాంటి బెదిరింపులు రావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఫేక్ మెయిల్ పంపిన నిందితుడిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు.

## భూమి కోల్పోయిన రైతులతో ఆర్బిట్రేషన్

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే–163జి అభివృద్ధి పనుల నేపథ్యంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపుపై అధికారులు బుధవారం ఆర్బిట్రేషన్ నిర్వహించారు. గీసుకొండ మండలం ఊకల్, నెక్కొండ మండలం వెంకటాపురం, అలంకానిపేట, నెక్కొండ, పత్తిపాక, పర్వతగిరి మండలం ఏనుగల్, సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతులతో ఈ సమావేశం జరిగింది. భూసేకరణకు సంబంధించిన పరిహారం, ఇతర సమస్యలపై రైతుల అభ్యంతరాలను అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారంపై చర్చించారు. రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, తహసీల్దారులు, రైతులు పాల్గొన్నారు.



## ఆగిన అమ్మ గుండె

- కొడుకు మృతి తట్టుకోలేక గుండెపోటు
- జగిత్యాల జిల్లా మోతె గ్రామంలో ఘటన

అక్షర దర్బార్, జగిత్యాల : కన్న కొడుకు మృతిని తట్టుకోలేక గుండెపోటుతో తల్లి కూడా మరణించింది. ఈ విషాద ఘటన బుధవారం జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన దొడ్ల సంపత్ అనే యువకుడు వ్యవసాయం చేస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ పనులు, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పును తీర్చలేక మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగాడు. అతడిని వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కొడుకు లేడన్న వార్త విని తట్టుకోలేక తల్లి దొడ్ల మల్లమ్మ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలింది. ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా గంటల వ్యవధిలోనే తల్లీకొడుకులు ఇద్దరూ మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## టెన్త్ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోనీ జడ్పీ హైస్కూల్లో మార్చి 14 నుండి పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నారు ఈ క్రమంలో పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు మొట్లపల్లి గ్రామ సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మొగుళ్ళపల్లి ఎస్సై ఎం సురేష్ ముఖ్యఅతిథిగా పాలొని ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

## కార్మికుల వారసులకు ఉద్యోగాలివ్వాలి

**- అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర**

అక్షరదర్బార్, భూపాలపల్లి: శాసనసభ వేదికగా భూపాలపల్లి నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గళమెత్తారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. సింగరేణి కార్మికుల సంక్షేమం, నిర్వాసితుల పునరావాసం మరియు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక విన్నపాలను ప్రభుత్వం ముందుంచారు. సింగరేణి సంస్థలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించి, తద్వారా వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గండ్ర కోరారు. కరోనా సమయంలో విధులకు హాజరు కాలేదన్న నెపంతో డిస్మిస్ అయిన భూపాలపల్లి డివిజన్ ఉద్యోగులను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చేలా ప్రభుత్వం గృహ నిర్మాణ పథకాలపై దృష్టి సారించాలని కోరారు.



**- పునరావాసం - ప్రజా సమస్యలు**

సింగరేణి ఉపరితల గనుల ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న గడ్డిగానిపల్లి, కొండపల్లి గ్రామ ప్రజలకు తక్షణమే పునరావాసం కల్పించి తరలించాలని సూచించారు. చెల్పూర్ జెన్కో నుంచి వెలువడుతున్న బూడిద వల్ల దుబ్బపల్లి గ్రామం తీవ్ర కాలుష్యానికి గురవుతోందని, ఆ గ్రామాన్ని కూడా సురక్షిత ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని గొల్లబుద్దారం, అజాంనగర్, నందిగామ, రాంపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదలకు అండగా నిలవాలని కోరారు. లొంగిపోయిన నక్సలైట్లకు ఇచ్చిన హామీ మేరకు గృహ వసతితో పాటు వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలన్నారు.

**- మౌలిక సదుపాయాలు**

కొత్తగా ఏర్పడిన కొత్తపల్లిగోరి మండలంలో కనీస వసతులు లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అక్కడ నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ప్రజల వైద్య అవసరాల దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915